చిన్నబోతున్న చిల్లర కొట్టు

వీధిలో ఉండే చిల్లర కొట్టు.. ఊరిలో ప్రతి ఒక్కరినీ పేరు/వరుస పెట్టి మరీ పిలిచే పరిచయం. సరకులు తీసుకెళ్లండి.. డబ్బులు చేతికందాక ఇచ్చేద్దురులే.. అనే నమ్మకం. గ్రామంలో ఏ కార్యక్రమం జరిగినా ఆర్థికంగా ముందుండే చొరవ. ఇదంతా కిరాణా దుకాణం నిర్వహించే వైశ్యులు/కోమట్లు గురించే..! గతంలో వీరికే పరిమితమైన ఈ వ్యాపారంలో తర్వాత్తర్వాత అన్ని సామాజిక వర్గాలూ ప్రవేశించాయి. సూపర్ మార్కెట్లు, షాపింగ్ మాల్స్, ఆన్‌లైన్ షాపింగ్‌ల రాకతో చిల్లరకొట్టు చిన్నబోతోంది.

- వ్యాపారం విచ్ఛిన్నమై.. ఆదాయం తగ్గుముఖం
- గతంలో వైశ్యులకే పరిమితమైన కిరాణా దుకాణాలు
- ఆ తర్వాత అన్ని సామాజిక వర్గాలూ ప్రవేశం
- షాపింగ్ మాల్స్, ఆన్‌లైన్ షాపులతో మరింత దైన్యం


సంతబయలులో 50 ఏళ్ల నాటి చిల్లర కొట్టు



ఆదర్శనగర్‌లో పదేళ్ల కిందట వెలిసిన షాపు

తగరపువలస: నియోజకవర్గంలో వ్యాపారాలు ఆశించినంతగా సాగక కిరాణా దుకాణాలు వెలవెలబోతున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో ఒక్కో గ్రామానికి ఒక్కో కిరాణా దుకాణం, తగరపువలస, మధురవాడ వంటి పెద్ద గ్రామాల్లో జనాభా ప్రాతిపదికన 5 నుంచి 10 దుకాణాలు గతంలో ఉండేవి. చాలా వరకు స్థానికులు ఆయా కిరాణా దుకాణాల వద్ద నెలవారీ ఖాతాలు తెరిచి, అరువుకు సామాన్లు తెచ్చుకునేవారు. కూలి డబ్బులు వచ్చాక వారానికి, నెలకి చెల్లింపులు చేసేవారు. 30 ఏళ్ల క్రితం వరకు తగరపువలసతో పాటు చుట్టుపక్కల గ్రామాల్లో దుర్గా, ఉప్పల, మద్దిల, బండారు తదితర ఇంటి పేర్లు కలిగిన వైశ్యులే చిన్న, పెద్ద కిరాణా దుకాణాలు నిర్వహించేవారు. వారి వారసులే ప్రస్తుతం పలు చోట్ల కొనసాగుతున్నారు.


రాజవీధిలో 80 ఏళ్ల నాటి ఉప్పల రాజులు కిరాణా దుకాణం

పరిస్థితి తారుమారు

ఇళ్లల్లో వివాహాది శుభకార్యాల సమయంలో మాత్రమే భీమిలి నియోజకవర్గ ప్రజలు ఎడ్లబండ్లు, రిక్షాలు, ఆటోలు వేసుకుని విశాఖ, విజయనగరంలోని హోల్‌సేల్ దుకాణాలకు పరుగులు తీసేవారు. మిగిలిన సమయాల్లో గ్రామాల్లోని దుకాణాలే ఆసరా. ప్రస్తుతం మారుమూల గ్రామాల ప్రజలు సైతం కిరాణా దుకాణాలకు ప్రత్యామ్నాయంగా షాపింగ్ మాల్స్, బడామార్టులు, ఆన్‌లైన్ కొనుగోళ్లపై ఆధారపడుతున్నారు. సామాజిక వర్గంతో పని లేకుండా చదువుకున్నవారు, చదువుకోని వారు కూడా ఉపాధి వెతుకులాటలో భాగంగా ఇంటి ముందు కిరాణా, పాన్ షాపులు తెరుస్తున్నారు. దీంతో గ్రామాల్లో పదుల సంఖ్యలో కిరాణా దుకాణాలు వెలిశాయి. అమ్మకాలు విచ్ఛిన్నమై, ఆదాయం తగ్గిపోయింది.

కొత్తదార్లు వెతుక్కుని..

మారుతున్న పరిస్థితుల్ని అర్థకం చేసుకున్న కొందరు వైశ్యులు కొత్తదార్లు వెతుక్కున్నారు. ఆర్థిక పుష్టి కలిగిన వైశ్యులు బంగారు ఆభరణాలు, ఎలక్ట్రానిక్స్, భవన నిర్మాణ సామగ్రి, హోటల్, కేటరింగ్, రియల్ ఎస్టేట్ వ్యాపారాల వైపు మళ్లారు. వాటిలో చాలా గొప్పగా స్థిరపడిన వారున్నారు. పెట్టుబడులు పెట్టలేని వారు తమ పూర్వీకులు నడిపిన కిరాణా దుకాణాలతో, అప్పటి ఫర్నిచర్‌తోనే కాలం వెల్లదీస్తున్నారు. ఎంతమంది పిల్లలు ఉంటే అందరూ చిల్లర కొట్టు పెట్టుకోవడం, అందులోనే బతుకుతెరువును వెతుక్కుంటూ కొనసాగుతున్నారు.


60 ఏళ్ల నాటి జ్యూట్‌మిల్లు రోడ్డులోని పెద సన్యాసి కిరాణా షాపు


రాజులు దుకాణంలో అప్పటి ఫర్నిచర్‌లో పప్పులు

ఉప్పల రాజులు షాపు ఫేమస్



80 ఏళ్ల క్రితం మా నాన్న నరసింహులు కిరాణా దుకాణం ఉప్పల రాజులుగా ఫేమస్. అప్పట్లో తగరపువలసలో రెండే కిరాణా దుకాణాలు ఉండేవి. మేం 4గురు అన్నదమ్ములం. మా అందరివీ కిరాణా దుకాణాలే. నేను మా నాన్న నిర్వహించిన అప్పటి దుకాణంలోనే వ్యాపారం చేస్తున్నాను.

– ఉప్పల సూర్యారావు, గాంధీబొమ్మ వీధి

50 ఏళ్లుగా వ్యాపారం



స్థానిక సంతబయలు ముఖద్వారంలో 50 ఏళ్లుగా చిల్లరకొట్టు నిర్వహిస్తున్నాను. గతంలో ఈ మార్గంలో నాది ఒక్కటే దుకాణం. ఉదయం నుంచి సాయంత్రం వరకు విరామం ఉండేది కాదు. ఇప్పుడు దుకాణాలు, ఆన్‌లైన్ షాపులు చాలా పెరిగిపోయాయి. దీంతో ఖాళీగా ఉంటున్నాను.

– మద్దిల సత్యనారాయణ, సంతబయలు

ఎంబీఏ చేసి నాన్నకు చేదోడుగా..



గతంలో మా సామాజిక వర్గంలో కిరాణా షాపు ఉంటే పోటీ పడి పిల్లనిచ్చేవారు. ఇప్పుడు ఉద్యోగం ఉంటేనే సంబంధాలు వస్తున్నాయి. మా తాతయ్య రాజులు నడిపిన దుకాణం.. అప్పటి ఫర్నిచర్‌తో ఇప్పటికీ నడుస్తోంది. ఎంబీఏ పూర్తి చేసి, మా నాన్నకు తోడుగా చిల్లరకొట్టులో ఉంటున్నా.

– ఉప్పల రాజేష్, తగరపువలస

మూడు తరాలుగా ఇదే వ్యాపారం



జ్యూట్‌మిల్లు రోడ్డులో మా తాతయ్య పెద సన్యాసికి ఒక్కటే కిరాణా దుకాణం ఉండేది. ఇప్పుడు ఈ రోడ్డులో పదుల సంఖ్యలో ఉన్నాయి. మూడో తరానికి చెందిన నేను ఇప్పుడు కిరాణా దుకాణం నిర్వహిస్తున్నా. వ్యాపారం అంతంత మాత్రమే. మా పిల్లల్ని ఈ వ్యాపారానికి దూరంగానే ఉంచుతా.

– బండారు నానాజీ, చిట్టివలస

క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీ మండల ఆత్మీయ సమావేశం నేడు

తగరపువలస: వైఎస్సార్‌సీపీ ఆనందపురం మండల ఆత్మీయ సమావేశం భీమిలి సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు(చిన్నశ్రీను) ఆధ్వర్యంలో సోమవారం ఉదయం 10 గంటలకు పాలవలస పంచాయతీ గుడిలోవలో జరుగుతుందని పార్టీ మండల అధ్యక్షుడు బంక సత్యం తెలిపారు. రంగనాథస్వామి పాదాల చెంత జరిగే ఈ సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్, అనకాపల్లి జిల్లా పార్లమెంట్ అధ్యక్షుడు కరణం ధర్మశ్రీ తదితరులు హాజరుకానున్నారన్నారు. మండలంలోని ఎంపీపీ, వైస్ ఎంపీపీలు, జెడ్పీటీసీ సభ్యుడు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ ప్రతినిధులు, జిల్లా, మండల అనుబంధ సంఘాల ప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ కుటుంబ సభ్యులు పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

చలామణీలో దొంగనోట్లు

తగరపువలస: భీమిలి పోలీస్ స్టేషన్ పరిధిలో అడపా దడపా దొంగనోట్లు చలామణిలోకి వస్తున్నాయి. నిరక్షరాస్యులైన చిరువ్యాపారులే వీటికి బలవుతున్నారు. తగరపువలస–భీమిలి రోడ్డులో ఆదివారం రూ.500 దొంగనోటు ఒకటి చలామణిలోకి వచ్చింది. ఊరూరా ఐస్ ఫ్రూట్‌లు విక్రయించే ఒక వ్యక్తి మధ్యాహ్నం రేఖవానిపాలెం కూడలిలో ఉండగా.. ద్విచక్ర వాహనంపై ముగ్గురు యువకులు మద్యం మత్తులో వచ్చి రెండు ఐస్ క్రీమ్‌లు కొన్నారు. రూ.500 నోటు ఇచ్చి తరువాత చిల్లర తీసుకుని వెళ్లిపోయారు. ఇంటికి వెళ్లి చూసుకునేసరికి అది ఫేక్ నోట్‌గా తెలుసుకుని లబోదిబోమన్నాడు. గతంలో కూడా ఒకసారి ఇదే బాధితుడు ఇలాగే ఫేక్‌నోట్ తీసుకుని మోసపోయాడు. నగదు లావాదేవీల సమయంలో నోట్లను ఒకటికి రెండు సార్లు తనిఖీ చేసుకోవాలని పలువురు సూచిస్తున్నారు.

పర్యావరణంపై అవగాహన ర్యాలీ


అవగాహన ర్యాలీలో వాణి వికాస్ ఫౌండేషన్ ప్రతినిధులు

తగరపువలస: ఆనందపురం మండలం గిడిజాలలో వాణి వికాస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం పర్యావరణంపై అవగాహన ర్యాలీ జరిగింది. తడి చెత్త, పొడిచెత్త సేకరణ గురించి ఇంటింటా ప్రచారం నిర్వహించారు. చెత్తను ఎక్కడ పడితే అక్కడ వేయకుండా పర్యావరణం, పచ్చదనానికి సహకరించాలని సూచించారు. కార్యక్రమంలో యువకులు పాల్గొన్నారు.

గంజాయి తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్


నిందితుడితో పీఎం పాలెం పోలీసులు

పీఎం పాలెం: అక్రమంగా గంజాయిని తరలిస్తున్న వ్యక్తిని పీఎం పాలెం పోలీసులు అరెస్ట్ చేశారు. స్థానిక సీఐ బాలకృష్ణ తెలిపిన వివరాలు.. జీవీఎంసీ 6వ వార్డులోని కొమ్మాది హౌసింగ్ బోర్డు కాలనీ రోడ్డులో మధురవాడ స్వతంత్రనగర్‌కు చెందిన అంగ రాజేష్ గంజాయిని తరలిస్తున్నట్టు పోలీసులకు శనివారం సాయంత్రం సమాచారం అందింది. వెంటనే పోలీసులు దాడి చేసి గంజాయి రవాణా చేస్తున్న రాజేష్‌ను అదుపులోకి తీసుకుని అతని నుంచి 2 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

మూడు ట్రాక్టర్లు, పొక్లెయిన్ సీజ్


పోలీసులు సీజ్ చేసిన ట్రాక్టర్

పద్మనాభం: మండలంలోని రెడ్డిపల్లి పంచాయతీ కొత్త చెరువులో నుంచి ఎటువంటి అనుమతులు లేకుండా మట్టి తరలిస్తున్న మూడు ట్రాక్టర్లు, ఒక పొక్లెయిన్‌ను పట్టుకుని సీజ్ చేసినట్టు పోలీసులు ఆదివారం తెలిపారు. తదుపరి చర్యల నిమిత్తం తహసీల్దార్ కె.ఆనందరావుకు సమాచారమిచ్చినట్టు చెప్పారు.

త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం


భగవద్గీతపై ప్రచారం చేస్తున్న భక్తులు

మధురవాడ: జీవీఎంసీ 5వ వార్డు కార్పెంటర్స్ కాలనీ, డ్రైవర్స్ కాలనీ పరిసర ప్రాంతాల్లో ఆదివారం త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం నిర్వహించారు. త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక పలు ప్రాంతాల్లో త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రాముఖ్యత, త్రిమత ఏకైక గురువు, తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ అవార్డు గ్రహీత, యోగి ప్రబోధానంద యోగి పీఠం స్థాపించిన ఆచార్య ప్రబోధానంద యోగీశ్వర స్వామి రచించిన 100 ఆధ్యాత్మిక రచనలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కమిటీ ప్రతినిధులు కె.త్రినాథరావు, కృష్ణసూరప్పడు, వి.సురేష్, ఎస్.శ్రీనివాస్, రాజు, బంగారు తల్లి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పైప్‌లైన్ లీకేజీతో ప్రయాణికుల పాట్లు


గోస్తనీ నది వంతెనపై లీకవుతున్న పైప్‌లైన్

పద్మనాభం: పద్మనాభంలోని గోస్తనీ నది వంతెనపై ఉన్న ఆర్‌డబ్ల్యూఎస్ పైప్‌లైన్ లీకవుతోంది. వంతెనపై ఒకపక్క నీరు నిల్వ ఉండిపోవడంతో రాకపోకలు సాగించడానికి ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. పద్మనాభం నుంచి మద్ది, గంధవరం వెళ్లే పైప్‌లైన్ నాలుగు నెలల నుంచి లీకై తాగు నీరు వృథాగా పోతోంది. ఈ వంతెనపై సింహాచలం, విజయనగరం, విశాఖపట్నం వెళ్లే బస్సులు, ఆటోలు, లారీలు, ద్విచక్ర వాహనాలు నిరంతరం ప్రయాణిస్తుంటాయి. నీరు నిల్వ ఉండిపోవడంతో భారీ వాహనాలు వచ్చేటప్పుడు ద్విచక్ర వాహన చోదకులు పక్కకు తప్పుకునే ప్రయత్నంలో ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత శాఖ అధికారులు తక్షణమే స్పందించి పైప్‌లైన్ లీకేజీని అరికట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.

22ఎ జాబితా నుంచి లేఅవుట్‌ను తొలగించాలి



మాట్లాడుతున్న సొసైటీ ప్రతినిధులు

మధురవాడ: విశాఖపట్నం రూరల్ మండలం మధురవాడ రెవెన్యూ గ్రామం సర్వే నెం.359, 360లలో ఉన్న సెంట్రల్ ఎక్సైజ్, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల కో ఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీకి చెందిన లే అవుట్‌ను 22ఎ జాబితా నుంచి తొలగించాలని సొసైటీ కార్యదర్శి బలరామకృష్ణ, సభ్యులు డిమాండ్ చేశారు. ఆదివారం ఇక్కడ జరిగిన జనరల్ బాడీ సమావేశంలో సభ్యులు మాట్లాడారు. పీఎం పాలెంలోని వైఎస్సార్ క్రికెట్ స్టేడియం ఎదురుగా ఉన్న సుమారు 20 ఎకరాల భూమిని స్వాతంత్ర్య సమరయోధుల నుంచి కొనుగోలుచేసి కలెక్టర్, వీఎంఆర్‌డీఏ అనుమతితో ప్లాట్‌లుగా విభజించి 209 మంది సభ్యులకు స్థలాలు మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. అందులో చాలా వరకు సదరు ఉద్యోగులు ఇళ్లు నిర్మించుకుని నివసిస్తున్నట్లు తెలిపారు. 2016లో ప్రభుత్వం సదరు భూమిని 22ఎ జాబితాలో చేర్చిందని వాపోయారు. దీనిని ప్రభుత్వ భూముల జాబితా నుంచి తక్షణమే తొలగించాలని డిమాండ్ చేశారు.

క్రీడా పోటీల్లో విజేతలకు బహుమతుల ప్రదానం


విజేతలకు షీల్డ్‌లు, సర్టిఫికెట్లు అందిస్తున్న మహేశ్వరరావు

పద్మనాభం: మండలంలోని రేవిడిలో నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన జిల్లా స్థాయి క్రీడా పోటీల్లో గెలుపొందిన విజేతలకు షీల్డ్‌లు, సర్టిఫికెట్లను జిల్లా నెహ్రూ యువ కేంద్రం కో–ఆర్డినేటర్ జి.మహేశ్వరరావు అందజేశారు. వాలీబాల్‌లో ప్రథమ, ద్వితీయ స్థానాలను కైవశం చేసుకున్న వెంకటాపురం టీమ్, రౌతులపాలెం టీమ్, రన్నింగ్‌లో ప్రథమ స్థానంలో నిలిచిన రౌతులపాలేనికి చెందిన పి.ప్రకాష్, ద్వితీయ స్థానం సాధించిన రేవిడికి చెందిన పి.రమణ, లాంగ్ జంప్‌లో ప్రథమ స్థానంలో నిలిచిన వెంకటాపురానికి చెందిన గొలగాని సురేష్, ద్వితీయ స్థానం సాధించిన అన్నంపేటకు చెందిన ఇజ్జాడ ప్రవీణ్‌లకు వాటిని పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సీర సూరప్పడు, శ్రీనివాస యువజన సేవా సంఘం అధ్యక్షుడు కె.సన్యాసినాయుడు, మిరాకిల్ ఎడ్యుకేషన్ అండ్ హెల్త్ వేల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు ఎం.స్వామినాయుడు, నెహ్రూ యువ కేంద్రం వలంటీర్ టి.మధు పాల్గొన్నారు.

పార్కు స్థలం పంచేసుకుంటున్నారు..

- మధురవాడ రెవెన్యూ గ్రామంలో ప్రభుత్వ భూమి ఆక్రమణ
- స్థలం విలువ రూ.కోటిన్నర


ఎన్‌జీజీవోస్ లేఅవుట్‌లోని పార్కు స్థలంలో వెలసిన భారీ షెడ్

మధురవాడ: ప్రభుత్వ స్థలాల పరిరక్షణలో జీవీఎంసీ అధికారులు అలసత్వం ప్రదర్శిస్తున్నారు. కోట్ల రూపాయలు విలువ చేసే పార్కులు, గెడ్డల పరిరక్షణ బాధ్యత తమది కాదన్నట్టు వ్యవహరిస్తున్నారు. దీనికి నగరంపాలెం రోడ్డు హైవేను ఆనుకుని ఉన్న స్థలాలు, గణేష్‌నగర్, స్వతంత్రనగర్ వంటివి ప్రత్యక్ష ఉదాహరణలు. తాజాగా 22ఏ జాబితాలో ఉన్న ఎన్‌జీజీవోస్ లేఅవుట్ పార్కు వంతైంది. ఇక్కడ మధురవాడ రెవెన్యూ గ్రామం సర్వే నంబర్ 174పీ, 175లోని ఎల్‌పీ నంబర్ 15లోని పార్కుకు చెందిన రూ.కోటిన్నర విలువ చేసే 200 గజాల స్థలంలో ఓ ప్రైవేటు కిచెన్ నిర్వాహకులు భారీ షెడ్ నిర్మించేసి.. అదీ తమ అత్తగారి సొత్తు అన్నట్టు ఎంతో దర్జాగా అనుభవిస్తున్నారు. కొద్ది రోజులుగా నిర్మాణ పనులు పూర్తి చేస్తూ అక్రమాన్ని సక్రమం చేసే ప్రయత్నం చేస్తున్నా ఎవ్వరూ పట్టించుకోలేదు. ఇక్కడ సుమారు ఎకరం పైనే పార్కు స్థలం ఉండగా.. ఈ స్థలం కొంత భాగంలో నుంచి గెడ్డ ప్రవహిస్తోంది. దానికి మరోవైపు సన్నని పాయలా ఉన్న దానిని గుట్టుచప్పుడు కాకుండా ఆక్రమించేశారు. ఇదే లేఅవుట్‌లోని 156, 158, 157 ప్లాట్‌లకు ఆనుకుని 60 అడుగుల రోడ్డుకు అవతల వుడా కాలనీ వైపు ఉన్న ఈ పార్కుకు చెందిన మరో పాయ లాంటి స్థలాన్ని మరి కొందరు ఆక్రమించేశారు. ఇలా లేఅవుట్ ఓపెన్ స్పేస్ స్థలాలను కొందరు వ్యక్తులు ఇష్టానుసారంగా పంచేసుకుంటున్నారు. ఈ ఆక్రమణ స్థలాలకు కరెంటు మీటర్లు కూడా వేసేశారు. ఈ తంతులో పెద్దలు, అధికారులంతా భాగాస్వాములేనన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఉన్నత స్థాయి అధికారులు తక్షణమే స్పందించి చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

నేడు జాబ్‌మేళా

మద్దిలపాలెం: డాక్టర్ వి.ఎస్.కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయబాబు తెలిపారు. దివీస్ లేబరేటరీస్ లిమిటెడ్‌లో ఉద్యోగ నియామకాల కోసం జరగనున్న ఈ జాబ్ డ్రైవ్ కేవలం పురుషులకు మాత్రమేనని చెప్పారు. ముఖ్యంగా బీఎస్సీ కెమిస్ట్రీ, బీ ఫార్మసీ, బీటెక్ కెమికల్, ఎమ్మెస్సీ ఆర్గానిక్ కెమిస్ట్రీ, ఎంఎస్సీ ఎనలిటికల్ కెమిస్ట్రీ, ఎం.ఫార్మసీ పూర్తి చేసిన విద్యార్థులకు ఒక సువర్ణ అవకాశమన్నారు. ఎంపికైన వారికి ఉచిత వసతి, ఉచిత యూనిఫాం, పీఎఫ్, ఈఎస్ఐ, రాయితీతో కూడిన భోజన సదుపాయం, జీతంతో పాటుగా కల్పించనున్నారని తెలిపారు. కనీస జీతం రూ.18,000, గరిష్ట జీతం రూ. 24 వేలుగా ఉంటుందన్నారు. అర్హులైన విద్యార్థులందరూ ఈ జాబ్ మేళాలో పాల్గొని ఉద్యోగాలను పొందాలని ప్రిన్సిపాల్ ఆకాంక్షించారు.

అనంతుని కల్యాణోత్సవాలకు ఆహ్వానం


చైతన్యానంద చిన్నస్వామికి ఆహ్వాన పత్రం అందిస్తున్న ఎంపీపీ రాంబాబు

పద్మనాభం: పద్మనాభం కుంతీమాధవ స్వామి ఆలయంలో ఈ నెల 9 నుంచి 15 వరకు నిర్వహిస్తున్న అనంత పద్మనాభ స్వామి కల్యాణోత్సవాలకు రావాలని విజయనగరం జిల్లా నెల్లిమర్ల శ్రీదుర్గ మహాపీఠం ఉత్తర పీఠాధిపతి శ్రవణ చైతన్యానంద చిన్నస్వామికి ఆదివారం ఎంపీపీ కంటుబోతు రాంబాబు ఆహ్వాన పత్రం అందజేశారు. నెల్లిమర్లలోని పీఠానికి ఆదివారం ఎంపీపీ వెళ్లి స్వామిజీకి ఆహ్వానం పలికారు. ఆహ్వాన పత్రాన్ని అందజేసిన వారిలో భక్త బృందం సభ్యులు అముజూరి అప్పారావు, తాలాడ పద్మనాభం, కంటుబోతు ఎర్నాయుడు ఉన్నారు.

పెన్షన్ల పెంపు కోరుతూ నిరసనకు పిలుపు


సమావేశమైన పెన్షనర్ల సంఘం ప్రతినిధులు

తగరపువలస: ప్రస్తుతం ఉన్న నిత్యావసర సరుకుల ధరలకు అనుగుణంగా పెన్షన్ పెంచడానికి సానుకూలంగా స్పందించిన కేంద్ర ప్రభుత్వం, బడ్జెట్ అనంతరం మాట మార్చడంపై నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు చిట్టివలస జ్యూట్‌మిల్లు పెన్షనర్ల సంఘం నిర్ణయించింది. ఆదివారం గుజ్జు రామునాయుడు భవన్‌లో సమావేశమైన సంఘం ప్రతినిధులు మాట్లాడారు. కేంద్ర కార్మికశాఖా మంత్రి, ఆర్థిక మంత్రి నిలువునా పెన్షనర్లను మోసం చేశారని ఆరోపించారు. ఈ నేపథ్యంలో ఈ నెల 13న చిట్టివలస లేబర్ వెల్ఫేర్ సెంటర్‌లో పెన్షనర్ల సమావేశం నిర్వహిస్తామన్నారు. 18న నగరంలోని ప్రాంతీయ పీఎఫ్ కమిషనర్ కార్యాలయం ముందు ధర్నా చేపడతామన్నారు. ఈ కార్యక్రమాలను పెన్షనర్లు జయప్రదం చేయాలన్నారు. సమావేశంలో సంఘం అధ్యక్షుడు కానూరి రాంబాబు, కార్యదర్శి దామోదర బాబాజీ, సహాయ కార్యదర్శి మోర అప్పలరాజు, ఉపాధ్యక్షుడు చిల్ల అప్పారావు, కోశాధికారి పంపాన సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కబేళా సంత కథ తేలేదెప్పుడు..!


అనధికార సంత స్థలాన్ని పరిశీలిస్తున్న జీవీఎంసీ వెటర్నరీ అధికారి కిషోర్

మధురవాడ: నగరంలోని కొమ్మాది ఓ జోన్ వ్యాలీ రోడ్డులో ఏర్పాటు చేసిన వైజాగ్ ఫుడ్స్ ఆధునిక కబేళాకు ఇబ్బందులు తప్పడం లేదు. ఇక్కడికి వచ్చే జీవాలకు స్టాక్ పాయింట్ ఏర్పాటు, రైతులకు కనీస సదుపాయలు కల్పించాలనే డిమాండ్ అనేక ఏళ్లుగా సాగుతోంది. ఈ వ్యవహారంలో జీవీఎంసీ అధికారుల ఉదాసీనతతో కొందరు దళారులు సొమ్ము చేసుకుని రైతులు, కాపరుల నుంచి ఇష్టానుసారంగా డబ్బులు వసూలు చేసుకుంటూ కనీసం సదుపాయాలు కూడా కల్పించడం లేదు. దీంతో రైతులు, గొర్రెలు, మేకల కాపరులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడని వారు వాపోతున్నారు. ఇరువురు వ్యక్తులు మధ్య తలెత్తిన స్థల వివాదం రైతులు కాపరులకు సంకటంగా మారింది. ఈ వ్యవహారంపై ఈ నెల 3న 'సాక్షి'లో 'కబేళా కథ మళ్లీ మొదటికి' అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనిపై జీవీఎంసీ అధికారులు తూతూ మంత్రంగా చర్యలు చేపట్టారు.

పరస్పర విరుద్ధ వ్యాఖ్యలు

స్టాక్ పాయింట్ లేదా సంత ఏర్పాటు చేయాల్సిన బాధ్యత కబేళా నిర్వాహకులదేనని జీవీఎంసీ అధికారులు చెబుతుంటే.. కబేళా నిర్వాహకులు మాత్రం కటింగ్‌కు వచ్చిన జీవాలకు మాత్రమే తాము కబేళా లోపల స్టాక్ పాయింట్ ఏర్పాటు చేస్తామని, బయట పాయింట్‌కు తమ బాధ్యత లేదని అంటున్నారు. శనివారం నుంచి ఇక్కడ సంతను తొలగించారు. దీంతో వీరు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

నేడు ఇరు పక్షాలతో సమావేశం

ఈ వ్యవహారంపై జీవీఎంసీ వెటర్నరీ అధికారి, జోన్–2 ఏఎంహెచ్‌వో కిషోర్‌ను 'సాక్షి' వివరణ కోరగా సోమవారం సాయంత్రం 4 గంటలకు మధురవాడ జోనల్ ఆఫీస్‌లో కబేళా నిర్వాహకులు–గతంలో కబేళా నుంచి అనుమతి పొందిన వ్యక్తి–రైతులతో సమావేశం నిర్వహించనునట్టు తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామన్నారు.

పోక్సో చట్టంపై అవగాహన అవసరం


మాట్లాడుతున్న మేజిస్ట్రేట్ సౌజన్య

భీమునిపట్నం: లైంగిక వేధింపులు, దాడులకు పాల్పడే వారిపై తీవ్రమైన చర్యలు తీసుకోవడానికి ఏర్పాటు చేసిన పోక్సో చట్టం గురించి అందరూ తెలుసుకోవాలని భీమిలి ఒకటో అదనపు జూనియర్ జడ్జి కోర్టు మేజిస్ట్రేట్ డి.సౌజన్య అన్నారు. స్థానిక సమీకృత బాలికల వసతి గృహంలోని బాలికలతోపాటు కళాశాల బాలికల వసతి గృహం బాలికలకు ఆదివారం పోక్సో చట్టంపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. మైనర్, మేజర్ బాలికలతో అనుచితంగా ప్రవర్తించే వారిపై కఠిన చర్యలకు పాల్పడే విధంగా రూపొందించిన ఈ చట్టం ద్వారా ఎవరైనా ఇటువంటి వాటికి పాల్పడితే యావజ్జీవ, మరణ శిక్షలు విధించే పరిస్థితులు ఉన్నాయని తెలిపారు. అందువల్ల ఈ చట్టం గురించి ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమన్నారు. ఎవరైనా బాలికలు, యువతులతో అనుచితంగా ప్రవర్తిస్తే ఏమాత్రం భయపడకుండా ముందుకొచ్చి ఫిర్యాదులు చేయాలన్నారు. ముఖ్యంగా తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు, తమకు రక్షణగా ఉండే ఎవరికైనా విషయాన్ని తెలియపరచి పోలీసులకు ఫిర్యాదులు చేయాలని సూచించారు. కార్యక్రమంలో సీఐ బొడ్డేపల్లి సుధాకర్, న్యాయవాదుల సంఘం అధ్యక్షులు ఎం.వి.పార్వతీశం, వార్డెన్లు పాల్గొన్నారు.